# వనజాక్షి

సి.సుజాత



కిరణ్ సెల్‌ఫోన్ వంక చూశాడు. నెంబర్ వస్తూ ఫోన్ రింగవుతోంది.

నవ్వొచ్చింది అతనికి.

'ఫోన్ తీయవేరా...' అంటూ శ్రీరామ్ ఫోన్ తీయబోయాడు.

అతని చేయి పట్టుకుని ఆపేశాడు కిరణ్.

సిటీ లిమిట్స్ దాటి కారు వేగంగా వెళుతోంది. శ్రీరామ్ వంగి నంబర్ చూశాడు. మళ్ళీ మళ్ళీ ఆగిపోతూ రింగవుతూ అదే నంబర్.

'వనజాక్షి గార్రా...' అన్నాడు ఆశ్చర్యంగా.

'అయితే...' కిరణ్ కళ్ళెగరేశాడు.

'అదంతే. కాసేపు మాట్లాడకు. ఫోన్ తీయకు.'

కిరణ్ వంగి టేప్ ఆన్ చేశాడు.

'సోగయా హై రాస్తా...' పాట నెమ్మదిగా వస్తోంది.

కిరణ్ పాటతో పాటు హుషారుగా ఈల వేస్తున్నాడు.

ఫోన్ మోగుతూ, ఆగిపోతోంది.

ఏదైనా అత్యవసరమైన పనేమోరా...'

శ్రీరామ్ మొహమాటంగా అన్నాడు.

కిరణ్ సిగరెట్ తీసుకొని లైటర్ కోసం జేబులు వెతికాడు. సిగరెట్ నోట్లో ఓ పక్కకి లాగి...

'ఏంట్రా పని...ఇప్పుడు ఆవిడ కొంపకు రమ్మంటుంది. దాన్ని భరించడం ఇప్పుడు నా వల్ల కాదు బాబూ...'

శ్రీరామ్ కళ్ళు పెద్దవి చేసి చూశాడు.

'అదేవిట్రా...'

'ఏం...వింటావా...' కిరణ్ భుజాలు ఎగరేసి సెల్‌ఫోన్ అందుకొన్నాడు.

"ఊ...నేనే...ఏవిటీ...ఇంతసేపు ట్రయ్ చేశారు. ఫ్రెండ్స్ ఉన్నారు...ఆఫీస్‌లోనే ఉన్నాను. అందుకే చూసికూడా సెల్ ముట్టుకోలేదు. ఇప్పుడే కిందకి వచ్చాను. సిటీ దాటి బయటికి వెళ్ళవలసిన పనివచ్చింది..."

సెల్ శ్రీరామ్ చేతికి ఇచ్చి రోడ్డు వైపుకు చూడటం మొదలు పెట్టాడు కిరణ్.

శ్రీరామ్ ఓ నిముషం తటపటాయించాడు. అటునుంచి డాక్టర్ వనజాక్షి గొంతు. ఎంతో చిన్నగా...ఆవిడ స్వభావసిద్ధంగా పలికే కసిరే పద్ధతికి విరుద్ధంగా. గుండె గొంతులోకి తెచ్చుకొన్నట్లు మనసుతీరా పలకరిస్తోందామె...

"ఎంత చల్లగా ఉంది కిరణ్...కమాన్ డార్లింగ్...అయామ్ వెయిటింగ్ ఫర్ యు. ఎన్ని యుగాలయిందో. లెక్కతేలడం లేదు కిరణ్..."

మొహం వికారంగా పెట్టాడు శ్రీరామ్.

కిరణ్ అతని మొహం చూసి నవ్వబోయాడు.

"ఏవంటదీ..."

శ్రీరామ్ ఫోన్ ఇవ్వబోయాడు.

కిరణ్ ఫోన్ అందుకొని...'ఒక్క నిముషం...' అన్నాడు.

ఫోన్ చేత్తో మూసి...

"ఇప్పుడు ఆవిడను తలచుకో...తరవాత ఆ పిలుపు విను...

నాకే కాదు....ఆవిడను చూస్తే ఎవరికైనా మూడ్ వస్తుందా?"

కిరణ్ పెద్దగా నవ్వాడు.

"ఊరుకో...ఆవిడకు వినబడుతుందేమో...

చిరాగ్గా అన్నాడు శ్రీరామ్. అతని మొహం ఎర్రబడింది. ఇటు వనజాక్షి గొంతు. అటు కిరణ్ నవ్వు రెండూ భరించలేననిపిస్తోంది అతనికి.

"విరహం వెళ్ళబోస్తోంది కదురా... చంపేస్తుందిరా బాబూ. ఆవిడను సీట్లో చూస్తే డిగ్నిఫైడ్ డాక్టర్‌లాగా ఉంటుంది కదా. అప్పుడు నోరెత్తాలంటే మనకైనా కాస్త ఇబ్బందే. అటువంటిది ఆ ఫోన్ చూడు. విన్నావుగా...ఉప్పెనదా బాబూ... నిజంగా ఆమే గనక వయసులో వుండి అందంగా ఉంటే..."

ఫోన్ తీసుకున్నాడు కిరణ్.

"ఆ...చెప్పండి...ఇప్పుడా...ఎక్కడున్నానో తెలుసా...అబ్బో చాలా దూరం వచ్చేశాను....సారీ...రాలేను. చాలా పనుంది...ఉహూ...ఇప్పుడు కాదు. నాకు ఇంట్రస్ట్‌లేదు...'

అవతల నుంచి ఆవిడ ఏమంటున్నదో శ్రీరామ్‌కి అర్థం కాలేదు. కిరణ్ విసుక్కుంటున్నాడు.

"లక్ష కారణాలుంటాయ్. అయినా ఇదే అలవాటుగా అయిపోవటం నాకు ఇష్టం లేదు. ఏదో ఒకసారి రెండుసార్లు సరదాపడ్డాం. అయిపోయింది. ఎందుకో నాకు నచ్చలేదు. ప్రతిదానికీ ఏం కారణాలుంటాయో. ఎందుకు. ఇంక ఇంట్రస్ట్ లేదు. అంతే దట్సాల్..."

కిరణ్ స్విచ్ ఆపేసి ఫోన్ పెట్టేశాడు.

శ్రీరామ్ దిగులుగా చూశాడు అతని వైపు...

"నీకు మటుకు బాధ్యత లేదట్రా. పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. ఇదంతా తమాషాకు మనసు లేకుండా చేశావంటే ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు శ్రీరామ్.

కిరణ్ మాట్లాడకుండా డ్రైవింగ్ మీద దృష్టి పెట్టి ఊరుకొన్నాడు.

* * *

బంజారాహిల్స్‌లో రోడ్‌నంబర్ టు లో చివరగా ఉన్న ఇల్లు. 'డాక్టర్ వనజాక్షి' నేమ్ ప్లేట్ మీద, అస్తమిస్తున్న సూర్యుని వెలుతురు బలహీనంగా పడి అక్షరాలు చమక్‌మంటున్నాయి. డాబామీది గ్లాస్‌వాల్‌లోంచి బయటికి చూస్తోంది వనజాక్షి. మూలగా ఉన్న వుయ్యాలకి అమర్చిన మువ్వలు గలికి కదలి సన్నగా మోగుతున్నాయి. తెరలు పల్చని తెరలు గాలికి ఊగుతూ...సాయంసంధ్యలో ఇల్లంతా ఎర్రని మెరుపుతో ఉంది. వర్షం రాబోయే ముందు చల్లదనంతో...ఇల్లంతా ఎ.సి.తో చల్లగా...వనజాక్షిలో మాత్రం ఆవేశం పెరుగుతూ...

ఆమె అస్థిమితంగా వచ్చి ఉయ్యాల బల్ల మీద కూర్చుంది. 90 కిలోల శరీరం బరువుకి ఉయ్యాల కిర్రుమంది. ఎదురుగ్గా అద్దంలోంచి వనజాక్షి, చిరాగ్గా మొహం పెట్టి కనిపిస్తోంది.

తన మొహం అంత చిరాగ్గా చూసుకొని విశాలాక్షికి నవ్వొచ్చింది. పెదవులు సాగదీయటం తప్ప ఆ నవ్వులో మొహంలో కొత్త అందం ఏదీ కనిపించలేదు. ఉయ్యాలలోంచి అద్దం దగ్గరకు వచ్చింది వనజాక్షి. అద్దం నిండుకూ శరీరం. చామనఛాయతో, బుగ్గలమీద గుంటలతో, పొట్టిగా కత్తిరించిన క్రాఫ్. చెవులకు రవ్వల స్టడ్స్. కళ్ళకింద నల్లని బోలు. తెలివిగా కనిపించే కళ్ళు. ముక్కుమీద నుంచి జారిన కళ్ళజోడు. పొట్ట బాగా పెరిగి నైటీలో ...కడుపుతోఉన్నట్లుగా అనిపిస్తోంది. ఏ మాత్రం గ్లామర్ లేని శరీరం.

'ఫ్చ్' వనజాక్షికి నిట్టూర్పు వచ్చింది. గ్లాస్‌వాల్‌లోంచి కిరణ్ హాయిగా నవ్వుతున్నట్లనిపించింది. సరిగ్గా ఆ గ్లాస్‌వాల్ దగ్గర ఫోన్ పక్కని మోడా మీద కూర్చున్నాడు. వంగి ఫోన్ తీసుకోవడం, ఎంగేజ్ వస్తుంటే చనువుగా, విసుగ్గా తన సొంతఫోన్‌లాగా విసిరిపడేయటం. అస

లు అందం అంటే అతనిదే. ఎంత నల్లని జుత్తు, ఎంత ఎర్రని పెదవులు, మాన్లీగా...ఎంత సున్నితంగా నవ్వుతాడా...ఉయ్యాల్లో కూర్చున్న తన దగ్గరికి వచ్చి కిరణ్ ముద్దిడిన వైనం వనజాక్షి గుర్తుకు తెచ్చుకొంది.

ఆ నిముషం... తన డాక్టర్ హోదా... తన వయసు, తన నిబ్బరం, అన్నీ కరిగిపోయిన ఆ క్షణం. అతను ఉద్రేకంతో, జలపాతంలా తన మీదకు విరుచుకుపడిన ఆ క్షణం వనజాక్షి వళ్ళు పులకరించింది. మళ్ళీ ఫోన్ చేతిలోకి తీసుకొంది. కాసేపటికి, 'ద నంబర్ యు ఆర్ కాల్డ్... స్విచ్‌డ్ ఆఫ్...ప్లీజ్ ట్రై ఎగైన్ ఆఫ్టర్ సమ్ టైమ్" అన్న రికార్డెడ్ స్వీట్ వాయిస్ వస్తోంది. వనజాక్షి విసుగ్గా ఫోన్ పెట్టేసింది...

* * *

కిరణ్ చూస్తున్న కొద్దీ...ఆశ్చర్యంగా ఉంది శ్రీరామ్‌కు.

"ఇదేవిట్రా..ఇలా చేశావూ...."

"ఓ..కే..ఓకే...అప్పుడలా జరిగిపోయింది. ఆవిడ పట్ల ఆ నిముషంలో కృతజ్ఞత ఏదో ఏడిసింది. తన ఆరోగ్యం ఇబ్బందప్పుడు...నా కాలు ఏమయిపోతుందోనని భయం వేసింది.

ఆవిడ ఎంతో శ్రద్ధ తీసుకొన్నారు. అప్పుడు ఆవిడ పట్ల ఎలాటి నెగెటివ్ ఫీలింగూ లేదు. అలా జరిగిపోయింది."

"సరే. నువు మటుకు...అప్పుడలా జరిగిపోయింది అంటూ రిలాక్సయిపోయావు. కానీ ఆవిడ ఈ విషయం సీరియస్‌గా తీసుకొందని తేలిపోయింది. ఆడవాళ్ళు చాలా విషయాల్లో సెన్సిటివ్‌గా ఉంటార్రాపాపం. అంతెందుకూ. మా వనజ చూడు, అస్సలు, నేను ఆవిడ సంగతి తిన్నదో లేదో కూడా పట్టించుకోను...నా చదువు...రాతపని, ఉద్యోగం... బస్. మరి మా వనజో...ఇప్పుడు నీతో పనిపాడూ లేకుండా తిరగటానికి ఎందుకొచ్చానా కూడా ఆరా తీసింది. ప్రాణం తీస్తుంది. ఎందుకు ఏంటీ అన్న మాటలు ఆవిడ నాలుక చివర్న ఉంటాయి. ఆవిడకు ఏం చేయగలం చెప్పు. నా బతుకంతా రూల్ చేయాలని చూస్తుంది. నేను తన మాట వింటున్నాననే భ్రమలో ఉంటుంది. నేను ఆవిడను పట్టించుకోను. ఆ విషయం కూడా స్పష్టం చేస్తాను. అప్పుడు ఏడుస్తుంది. తెల్లారి మర్చిపోతుంది. ఇదంతా నీక ఎందుకు చెబుతున్నానంటే...నా భార్య వయసులో చిన్నది...చదువుకున్నది...నా విషయంలో ఎందుకింత పొసెసివ్‌గా ప్రవర్తిస్తుందో. నేను ఆవిడ గుప్పిట్లోంచి ఎందుకు స్వేచ్ఛ కోసం తపిస్తూ పారిపోతానో నీకు అర్థం కావాలని చెపుతున్నా. అటువంటిది వనజాక్షి వంటి వంటరిది, తోడుకోసం తపించే ఆడది నిన్ను నమ్ముకొంటే..."

"ఓకే...రా...అంతా బానే వుంది. ఆవిడతో ఇంకా కొన్నాళ్లు ఇలా గడిపితే నాకు జీవితేచ్ఛ నశించేలా ఉంది. ఆవిడ మొహం దగ్గరగా చూడు. ఎంత భయంకరంగా ఉంటుందో.." భుజాలు ఎగరేశాడు కిరణ్.

"మరి ముందెందుకు ప్రేమగా ఉన్నావూ...."

"ప్రేమా...అది ప్రేమంటారా వట్టి ఆవేశం...గ్లామర్...అప్పుడు యాక్సిడెంట్ అయినప్పుడు గుర్తుందిగా..."

శ్రీరామ్ మాట్లాడలేదు. అప్పుడూ ఇలాగే తామిద్దరూ వెళుతున్నప్పుడే ఆ స్పీడ్‌కి డివైడర్స్ అంచుకు కొట్టుకొని కారు పల్టీకొట్టింది. కిరణ్‌కి మోకాలు విరిగిపోయింది. తను కాస్త దెబ్బలతో లేచి నిలబడ్డాడు. హాస్పిటల్‌కు వెళ్ళిపోయారు. ఇక వాడి అరుపులు, కేకలతో హాస్పిటల్ అదిరిపోయింది. వనజాక్షి గారి చేతులు పట్టుకొని ఏడుపులు మొదలు పెట్టేశాడు. ఆవేళ ఆమె చాలా ఓర్పు చూపించారు.

"నీకెంత అభిమానంగా ట్రీట్ చేశార్రా..."

కిరణ్ తలతిప్పి విసుగ్గా శ్రీరామ్ వంక చూశాడు.

అతనికి మనసులో గిల్టీగా ఉంది.

నిజమే. ఆ రోజు తనను ఆమె ముట్టుకొని ఓదారిస్తే రిలాక్స్‌డ్‌గా అనిపించింది. ఎక్కడిక్కడ కత్తిరించి ప్యాంటు తీయించింది. ఎముక బయటపడి రక్తం కారుతున్న మోకాలు చూసుకొని కెవ్వుమని అరిచేడు తను. 'డాక్టర్ నా కాలు' అన్నాడు ఏడుస్తూ.

వనజాక్షి పక్క మీద కూర్చుంది. భుజం మీద చేయివేసింది.

"తగ్గిపోతుంది...ఏవీ కాదు. కాస్త కోఆపరేట్ చేయాలి. నేను బాండేజ్ వేస్తాను. రెండునెలల్లో నడుస్తారు"

ఆమె కళ్ళు...దయగల మొహం... ఇచ్చే ధైర్యం, నమ్మకంతో తను తేరుకొన్నాడు. నొప్పికి కాస్త కేకలు పెట్టినా మనసులో టెన్షన్ తగ్గింది. హాస్పిటల్‌లో ఉన్నంతకాలం రమ వచ్చేది భోజనం తీసుకొని. ఇద్దరు పిల్లలతో, ఆఫీస్ పనిలో తనకు తీరదు. బాయ్ వెంకట్ తప్ప తనకి మాట్లాడే దిక్కు లేదు. వనజాక్షి గారు నెమ్మదిగా స్నేహంగా, ముందుకు వచ్చారు. గంటలు, గంటలు కూర్చునేవారు. ఆవిడ కబుర్లు అప్పుడు బాగానే ఉండేవి. ఆవిడ తనపట్ల ఎక్కువగా ప్రేమ చూపించటం, తనకు తెలుస్తూ ఉండేది. అవసరం ఉన్న లేకపోయినా, తరుచూ తనను ముట్టుకోవాలని చూడటం... కొంత అర్థం అయ్యాక తనకు ఏం తేలేది కాదు. తను ఊహిస్తున్నారా? నిజమేనా! వనజాక్షికి తనతో స్నేహానికి అర్థం ఏమిటీ? తనను చూడగానే ఆవిడ మొహం వికసించేది. ఆ రోజు ఇప్పుడే జరిగినంత ఫ్రెష్‌గా గుర్తుంది. రమ వచ్చి భోజనం ఇచ్చేసి వెళ్ళిపోయింది. స్పెషల్ రూమ్‌లో ఏ.సి.శబ్దం తప్ప ఇంకేవీ లేదు. తొమ్మిదిగంటల తరువాత వనజాక్షి వచ్చింది నైట్‌డ్యూటీకి. తెల్లటి ఇస్త్రీ చీరెలో, చాలా డిగ్నిఫైడ్‌గా వుంది. వస్తూనే జ్వరం ఎంతుందో చూసింది. ఛార్ట్ చూసింది. ఆవిడంటే అప్పుడెంతో గ్లామర్. తన కాలుమీద చేయివేసి చూస్తోంది. అప్పుడు ఆమె తన వంక చూసిన చూపుల్లో ఎంత కాంక్షో. చేయి పట్టుకొన్నాడు తను. వనజాక్షి వద్దనలేదు. తనకు మనసులో భయం. ఆవిడతో పోలిస్తే చదువు, సంస్కారమూ, ఇంకా



దేనిలోనూ తనకు ప్రత్యేకత లేదు. పెద్దవాళ్ళు సంపాదించి, ఇచ్చిన ఆస్తి తప్ప, కార్లూ మేడలూ తప్ప...తన ఉనికి కూడా ఎవరికీ తెలియని ఒక మామూలు బిజినెస్‌మాన్. తన మీద ఒక డాక్టర్ మోహావేశం కలగటం... ఆ రోజు చాలా గొప్పగా అనిపించింది. వనజాక్షి చల్లగా నవ్వింది. ఆ రాత్రే ఆవిడ కార్లో, ఆవిడ పక్కన కూర్చుని జంజారాహిల్స్ మెట్లెక్కాడు.

"నిజంగా నేను నచ్చానా..." అన్నది వనజాక్షి.

తనింకా తేరుకోలేదు.

"ఏవీ మాట్లాడొద్దు" అన్నాడు తను. నిజానికి తన ఆనందం, తన కృతజ్ఞత, తన ఫీలింగ్స్ గానీ వివరించి చెప్పే శక్తి తనకు ఎంతమాత్రం లేదు...అంతే!

"మరి ఇప్పుడెందుకు నచ్చలేదూ..." అంటున్నాడు శ్రీరామ్.

కిరణ్‌కి విసుగొచ్చింది.

"చంపుతోందిరా...నాకు పనులుండవూ...నేను తన మొగుడ్ని అనుకొంటే ఎట్లా...నాకు మా రమతో గడిపేందుకే కుదరదు. మనం కలుసుండే టైమ్ కోసమే నేను తాపత్రయపడుతూ ఉంటా. ఆవిడతో నాకు కుదరదురా బాబూ. ఆవిడ ముందు జాగ్రత్తగా ఉండాలి. ఆవిడ్ని ఎంటర్‌టెయిన్ చేయాల్రా. ఆవిడను నేను మెయిన్‌టెయిన్ చేయలేను. పోనిద్దూ వెధవ టాపిక్. ఏదైనా చెప్పు. మొన్న ఒకటో తేదీన 'ఫన్ డే' వెళ్లాంరా...అవ్వాళ స్టేజ్ ప్రోగ్రాం..."

శ్రీరామ్ నిట్టూర్చాడు. కిరణ్ చెపుతున్నవేవీ శ్రీరామ్ బుర్రకు ఎక్కడం మానేశాయి. ఎక్కడో బతుకులో దగాపడిన వనజాక్షి అతని కళ్ళముందు మెదలుతోంది. పెళ్లికాలేదు. వయసు మీరిపోయింది. కానీ ఎలాటి రాంగ్ ఛాయిస్. తన మీద ప్రేమా, అభిమానమా, ఇష్టమా? ఎదుటిమనిషికి ఎలాటి భావం వుందో తెలుసుకోకుండానే ఎందుకు తొందరపడిందో అర్థం కాలేదు. కారు రయ్‌మంటూ, ప్రాణం లేని రోడ్డును మింగేస్తూ, పచ్చని చెట్ల మధ్యనుంచి వెళ్లిపోతోంది.

* * *

వనజాక్షి ఎదురుగ్గా వున్న టాబ్లెట్ల వంకే చూస్తోంది. 'ఈ డోస్ చాలు తెల్లారి అవుట్. తను పోయినా తరువాతే అందరూ చూసేది. తను చేసిన పనికి తనకే గిల్టీగా ఉంది. శరీరం ఇంత బలమైందని రెండునెలలు...కేవలం రెండునెలల్లో తనకు తెలిసింది. తన సంస్కారం, తన చదువు, తన హాస్పిటల్...ఇవన్నీ మరచి ఒక వ్యక్తితో ఎఫైర్ పెట్టుకుంటే ఉద్రేకం, ఉన్మాదం తన అనుభవంలోకి ఎలా వచ్చింది. పెళ్లిచేసుకోవాలనే కోరిక తనకెప్పుడూ కలుగలేదు. చదువు...చదువు...వరసాగ్గా ఏదో ఒక కోర్సు చదివేందుకు అవకాశం రావటం..తరువాత ఉద్యోగం, డబ్బు,హోదా. బొత్తిగా తీరికలేని జీవితం. కిరణ్ ఎలా తన జీవితంలోకి రాగలిగాడు. కేవలం ఆకర్షణ. తనపట్ల ఆరాధనగా మాట్లాడటం, అతని నవ్వులు, కబుర్లు, తనకు సంబంధం అతను చెప్పే సరదా వ్యవహారాలు. అతని పట్ల శరీరవ్యామోహం. అంతే. సరిగ్గా చెప్పాలంటే అతనితో అనుబంధంతో తన జీవితం ఉంటే ఒకే ఒక వెల్తి తీరుతుందని ఎందుకు అనిపించింది. తనని ప్రేమగా సేదదీర్చుతాడనిపించింది. కానీ అందుకు సంస్కారం కావాలని తరువాత తేలింది. వనజాక్షి గ్లాసులో నీళ్లు అందుకొని టాబ్లెట్లు వేసుకునేందుకు సిద్ధం అయింది. విసురుగా తలుపు నెట్టుకొని నర్సు వచ్చింది.

"మేడమ్ ఆ పాప చచ్చిపోయేలా వుంది"

వనజాక్షి దిగ్గున లేచింది.

"ఎవరూ శాంతా..."

***(తరువాయి 19వ పేజీలో)***

# కనీసం పదోతరగతికూడా పాసవకుండానే...?

మాది మారుమూల పల్లెటూరు.

చిన్నప్పటినుండి చదువంటే ప్రాణం. కానీ చదవలేకపోయాను. దానికి కారణాలు [illegible] [illegible] ప్రస్తుతం నా సమస్య. ఇప్పుడు నేను హైదరాబాదు వచ్చేశాను.

ఒక లిమిటెడ్ కంపెనీలో ఆఫీసు బోయ్‌గా ఉద్యోగం చేస్తున్నాను. జీతం ఫర్లేదు. పెళ్లి చేసుకున్నాను. అయినా డిగ్రీ చదవాలి. పి.జి. చేయాలంటే అనేలాంటి కలలు ఇంకా నన్ను పలకరిస్తూనే ఉంటాయి.

పేపర్లలో తరచూ-

ఎలాంటి విద్యార్హతలు లేకుండా డైరెక్టుగా డిగ్రీ పూర్తి చేయవచ్చు...అనే ప్రకటనలు కన్పిస్తుంటాయి. ఇవన్నీ నిజమేనా?

నేను బి.ఎ.చదవాలి. ఆ తర్వాత ఎమ్మె చదవాలి.

నా వయసు ఇరవైమూడు సంవత్సరాలు. నేను చదివింది కేవలం తొమ్మిదో తరగతి. మరి డిగ్రీ పరీక్షలు డైరెక్టుగా రాయవచ్చా?

మాలాంటి వారికి సౌకర్యంగా ఉండే యూనివర్శిటీలు ఉన్నాయా? కనీసం పదో తరగతి కూడా పాసవకుండా, ఇంట్లో ఉండే డైరెక్టుగా డిగ్రీ పరీక్షలు రాయవచ్చునే ప్రకటనలు నిజమేనా? స్కూలు ఫైనల్ పూర్తి చేయని వాళ్లు కూడా డిగ్రీకి ఎప్పియర్ అవ్వడమనేది ప్రాక్టికల్‌గా సాధ్యపడుతుందా?

ప్రతిరోజు ఎన్నెన్నో ప్రవేట్ ఎడ్యుకేషనల్ అకాడమీలు ఇచ్చే ప్రకటనల వెనక సాధ్యాసాధ్యాలు ఏమిటి? వాటి ద్వారా మోసపోకుండా పరీక్షలు రాయాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

-సాదం రాములు,
హైదరాబాదు.

ముందుగా చదువు పట్ల మీకున్న ఆసక్తిని అభినందించి తీరాలి. ఎప్పుడో తొమ్మిదో తరగతిలో చదువు ఆపేశారు. ఇప్పుడు ఇరవైమూడేళ్లంటున్నారు. అంటే దాదాపు పదేళ్ల తర్వాత తిరిగి చదువు మొదలు పెడుతున్నారన్నమాట.

అయితే మీకున్న సందేహాల్ని పరిశీలిస్తే...ఎలాంటి విద్యార్హతలు లేకుండా నేరుగా డిగ్రీ పరీక్షలు రాయడం సాధ్యమేనా అంటే సాధ్యమే!

భారతదేశంలోని దాదాపు ఇరవై యూనివర్శిటీలు ఇలాంటి అవకాశాన్ని కలిగిస్తున్నాయి. వీటిలో ఏ యూనివర్శిటీ ద్వారా అయినా డైరెక్టుగా డిగ్రీ పరీక్షలు రాయవచ్చు. వాటిలో బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్‌యూనివర్శిటీ, ఆంధ్ర, అన్నామలై లాంటి యూనివర్శిటీలు మీకు అందుబాటులో ఉండి, తిరిగి చదువుకునే అవకాశాన్ని కలిగిస్తున్నాయి.

ఇక మీ రెండో సందేహం...కనీసం స్కూల్‌ఫైనల్ కూడా పాసవకుండా డిగ్రీ పరీక్షలు రాయడమనేది ప్రాక్టికల్‌గా సాధ్యమా అంటున్నారు.

నిస్సందేహంగా!

కనీసం చదవడం కూడా రానివారి కోసం డైరెక్టు పరీక్షలు అనడం లేదు. చదవగలిగి, చదువుకోవాలనే ఆసక్తి ఉన్నవారి కోసం ఇలాంటి ప్రత్యేకమైన అవకాశాలు అని గమనించాలి. మీరు స్కూల్‌ఫైనల్ కూడా పాసవలేదు.

అయినా...స్కూల్‌ఫైనల్ కూడా పాసవని వారు ఏకంగా డిగ్రిపరీక్షలు రాయవచ్చా, ఇది ప్రాక్టికల్‌గా సాధ్యమా అన్నారు. చూశారా మీ ప్రశ్నలో చక్కని భావప్రకటనతో పాటు, మంచి లాజిక్ కూడా ఉంది. అలాగే స్పష్టత కూడా! మీలాంటి వారికి కావల్సిందల్లా అవకాశం, మార్గదర్శనం! కేవలం మీలాంటి వారికోసమే నిర్వహిస్తున్న ఈ పరీక్షలు మీరు అధిగమించలేని గోడలు కావని గమనించండి. అలాగే మీ చివరి సందేహం-

'ప్రవేట్ ఎడ్యుకేషనల్ అకాడమీలు సాధ్యాసాధ్యాలను ఎలా తెలుసుకోవాలి' అంటున్నారు. ప్రభుత్వం సురక్షితమైన అవకాశాలను కల్పిస్తున్నప్పుడు ఇంకా ప్రవేట్ అకాడమీల ప్రసక్తే అనవరం కదా! కాబట్టి అధైర్యపడకుండా అడుగు ముందుకు వేయండి!

-వార్త 'వృత్తి డెస్క్

మీ సమస్య మానసికం, శారీరకం
వృత్తి సంబంధం, లీగల్, మెడికల్ ఏదైనా కావచ్చు.
**ఆదివారం వార్త** ప్రియపాఠకులకోసం ప్రారంభించిన ఈ శీర్షిక మీదే!
మీ సమస్యల కనుగుణంగా ఆయా సంబంధిత రంగాలకు చెందిన
వృత్తి నిపుణులు సలహాలిస్తారు. మీ సమస్యలు పంపవలసిన
చిరునామా: పరిష్కారం, **'ఆదివారం వార్త'**, డిబిఆర్ మిల్స్‌రోడ్,
లోయర్‌ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080

**వనజాక్షి (కథ)** (11వ పేజీ తరువాయి)

"అవునమ్మా"

ఒక నిముషం వనజాక్షి ఆలోచించింది. "తను చచ్చిపోవాలి అంతే. ఈ అవమానం మోస్తూ జీవితాంతం బతికే ఓపిక లేదు" కానీ పదినిముషాలు వాయిదావేస్తే వచ్చే నష్టం లేదు. శాంతికి ఆక్సిజన్ కూడా అందటం లేదు. పద్దెనిమిదేళ్ళపిల్ల. పాయిజన్ తీసుకొంది. వనజాక్షిలో డాక్టర్ నిద్రలేచింది. శాంతి చేయి తన చేతిలోకి తీసుకొంది. నర్స్ ఆదుర్దాగా చూస్తోంది. వనజాక్షి ఇక మాట్లాడదు. పేషెంట్ బతుకుతోందని ఆమెకు అర్థం అయింది.

* * *

వనజాక్షి చేతులు కడుక్కోంటోంది. నర్స్ చేతుల మీద నీళ్ళు పోస్తోంది. 'నాలుగు గంటలు పట్టింది మేడమ్'. వనజాక్షి నవ్వి శాంతివైపు చూసింది. మొహం వాడినట్లున్నా ప్రశాంతంగా ఉంది. కిరణ్ గుర్తొచ్చాడు వనజాక్షికి. అతను చేసిన గాయం మానేందుకు తన జీవితం సరిపోతుందా? మోసపోయిన ఎందరో ఆడవాళ్ళ లిస్ట్‌లోనూ తను ఉండదు. ఇందులో తన తప్పే ఎక్కువ. ప్రతిమనిషికీ ఆశలుంటాయి. అనుభూతులుంటాయి. జీవితంలో ఎవరి ప్రయారిటీలు వాళ్ళకుంటాయి. కిరణ్‌తో సుఖంగా గడపాలని, తన బంగారు పంజరంలోంచి బయటకు రావాలని తను కోరుకొంది. తన గుప్పిట్లోంచి బయటపడి బతకాలని అతను కోరుకున్నాడు. ఇద్దరూ సమాంతరరేఖలు. అసలు ఇద్దరి మధ్య ఉన్న సంబంధం ఎటువంటిది?

వనజాక్షి మెట్లెక్కడం మొదలుపెట్టింది. కాళ్ళులాగుతున్నాయి. ప్రాణశక్తి అంతా ఉడికిపోయినట్లు అనిపిస్తోంది. మనసు దహిస్తోంది. అతని తిరస్కారం, తన ఓటమి...ఎన్ని విఫలమైన కేసులు. అందరూ గాయపడిన వారే! అందుకే బతుకుమీద ఇచ్ఛ చంపుకొంటారు. ప్రతినిముషం అతని తిరస్కారం గుండె కోస్తూంటే తనేమవుతుందీ!

"అమ్మా" కింద నుంచి చిన్నగా ఎవరో పిలిచినట్లయింది.

ఆఖరి మెట్టు రెయిలింగ్ పట్టుకొని ఒకామె నిలబడి ఉంది. రెండు చేతులు జోడించింది ఆమె.

"అమ్మా బిడ్డను బతికించావు. నా చర్మం వలిచి మీ రుణం తీర్చుకోవాలని ఉంది. ఎవరో మోసం చేశారని గుండెబద్దలు చేసుకొంది పిల్ల. అమ్మనెందుకు మరిచిందో అర్థం కాలే! నేనున్నానమ్మా, బిడ్డను కడుపులో పెట్టుకొంటా. ఒకవేళ అది బిడ్డను కంటే నేను ఇద్దర్నీ సాక్కుంటా..."

వనజాక్షి విసురుగా మెట్లు దిగివచ్చింది. ఆమె చేయి అందుకొంది.

"శాంతి సరిగానే ప్రవర్తించిందా?"

వనజాక్షి గుండె కొట్టుకొంది.

'నేను సరైన మార్గంలోనే నడిచానా?' అని అడుగుతున్నట్లే ఉంది.

'ఎందుకమ్మా శాంతిది తప్పు. ఏదో ఆశ పడింది. పిల్లడు అందంగా ఉన్నాడు. మాటకారి. అది వయసులో ఉంది. మగాడు సుఖపడతాడు. కానీ స్వార్థంతో దులుపుకుపోతాడు. ఆడాళ్ళం మనం బిడ్డల్ని కంటాం. మనకు స్వార్థం వుంటే ఇంటిల్లిపాదీ ఆనందంగా ఉండరు. వండిన వాటిల్లో, ఉన్నవాటిల్లో మంచివి ఏరుకొని తినే ఆడది ఎక్కడుంటుందో నాకు సూపించు. దానికి ఇవ్వటం తెలుసు. ఆడది ఇవ్వటంలో ఉన్న ఆనందం తెలిసిన మనిషి. పుచ్చుకొనే దొరలకి గొప్పమనసు ఉండదు ఏంచేస్తాం..."

ఆవిడ నిట్టూర్చింది.

వనజాక్షి ఆమె చేయి వదిలేసింది. ఆవిడ నమస్కారం పెడుతూ వెనక్కి తిరిగి[illegible]

వనజాక్షి మెట్లమీద కూర్చుంది. నర్స్ లేబర్ రూమ్ తలుపు తీసుకొని బయటకు వచ్చింది. మెట్ల మీద కూర్చుని వనజాక్షిని చూసి నవ్వుతూ దగ్గరికి వచ్చింది.

"అమ్మా సరోజగారికి నెప్పులెక్కువయ్యాయి. మీరు దగ్గర్నే ఉండాలని కోరుతో[illegible]. ఆవిడ బిడ్డను ముందుగా మీరే ముట్టుకోవాలిట. మీ అంత గొప్పది కావాలిట [illegible] పాపాయి"

వనజాక్షి చేతులు చూసుకుంది.

కిరణ్‌ని తాకిన చేతులు. కిరణ్‌కి లొంగిన శరీరం. దీన్ని అసహ్యించుకొందామా వద్దా...

"అమ్మా రండి..." నర్స్ పిలిచింది.

"పద"

వనజాక్షి లేచింది.